క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



ఆరికతోటలో పేదలకు దుస్తులు అందజేస్తున్న బాప్టిస్ట్ చర్చ్ సంఘం పెద్దలు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటలో క్రిస్మస్ పండగ వేడుకలలో భాగంగా ఏడీఎం ఎం బాప్టిస్ట్ చర్చ్ సంఘం పెద్దలు సుమారు 900 మంది పేదలకు చీరలు, పంచెలు తదితర దుస్తులు బుధవారం పంపిణీ చేశారు. ఆరికతోట చర్చిలో క్రిస్మస్ ప్రార్థనల అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెంకి పుష్పమ్మ మాట్లాడుతూ అన్నదానం, వస్త్రదానంలో ఉన్న సంతృప్తి మరి దేనిలోనూ పొందలేమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



వన్నలిలో పారిశుద్ధ్యపనులు పరిశీలిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని అంబకండి, వన్నలి, సంకిలి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు బుధవారం ముమ్మరంగా చేపట్టారు. వ్యాధులు ప్రబలకుండా మురుగు నీటిని ఆరుబయటకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈఓపీఆర్డీ వీవీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు.

గర్భిణుల వివరాల సేకరణ



వండానపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణుల వివరాల నమోదు

రేగిడి: గ్రామాల్లో గర్భిణుల వివరాలు సేకరిస్తున్నామని బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత తెలిపారు. మండల పరిధి వండానపేట, కేఎంవలస, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి గర్భిణులకు సంబంధించి పూర్తి స్థాయి వివరాలు నమోదు చేయాలని సూచించారు.

మంచుదుప్పటి



మద్దూరుపేట వద్ద పొలాలపై దట్టంగా కురుస్తున్న మంచు

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామాల్లో మంచుదుప్పటి బుధవారం కప్పుకుంది. దట్టంగా కురిసిన పొగమంచుతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అపరాలతో పాటు మామిడిపూతకు ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు రైతుల పంటలు దెబ్బతినకుండా తగిన సూచనలు, సలహాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

రహదారిపై నీటితో ఇబ్బందులు



ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న లీకుల నీరు

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద పాలకొండ–రాజాం ప్రధాన రహదారిపై పైపులైన్ల ద్వారా నీరు లీకు కావడంతో రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగావళి నది నుంచి విజయనగరం వెళ్లే ఆర్‌డబ్ల్యూఎస్ పైపులైన్ లీకులకు గురౌతుంది. అధికారులు స్పందించి లీకులను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

నేడు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించనున్నట్టు కమిషనర్ పి.నల్లనయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశానికి స్టాండింగ్ కమిటీ ప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

రహదారు(ణా)లు



రాజాం మండలంలో గడిముడిదాం-సీఎస్‌ఆర్‌పురం గ్రామాల మధ్య రహదారి

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- ఆటోలు, 108 వాహనాలు సైతం తిరగలేని పరిస్థితి
- కొత్త రోడ్ల కోసం ప్రజలు ఎదురుచూపు

రాజాం/వంగర:

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు దారుణంగా తయారయ్యాయి. ప్రయాణికులు సరైన రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోకి ఆటోలు, 108 వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాలు కనీస అభివృద్ధికి నోచుకోవడంలేదు. గ్రామాల్లో సరైన మౌలిక వసతులు లేకపోగా, ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వేసే లింకురోడ్లు సైతం అధ్వానంగా మారాయి. ప్రజలు రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నారు.

రాజాం మండలంలో..

రాజాం మండలంలో మొత్తం 21 పంచాయతీలు ఉండగా, ఏ పంచాయతీకి ఆయా పంచాయతీ పరిధిలోని మిగిలిన గ్రామాలకు పక్కా రోడ్లు నిర్మాణాలు జరగలేదు. గతంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీరాజ్‌తో పాటు ఆర్థిక సంఘ నిధులతో రహదారులు వేసేవారు. ప్రస్తుతం వీటి నిర్మాణం లేక పలు గ్రామాలకు రహదారులు అధ్వానంగా మారాయి. ప్రధానంగా దోసరి – ఆగూరు, గడిముడిదాం – సీఎస్‌ఆర్‌పురం, బొద్దాం – సోపేరు, బొద్దాం – కొఠారిపురం తదితర గ్రామాల మధ్య రహదారి సౌలభ్యం కనుమరుగైంది.

వంగరలో..

వంగర మండలంలోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల నుంచి పల్లెలకు మట్టిరోడ్లపైనే ప్రజలు నడక సాగించాల్సిన దుస్థితి. మండలంలోని చంద్రంపేట-జనార్ధనవలస జంక్షన్, ఇరువాడ-చౌదరివలస, మరువాడ-సీతాదేవిపురం, కొప్పరవలస జంక్షన్-రుషింగి, కొట్టిశ-కె.కొత్తవలస, మద్దివలస-తలగాం, బాగేంపేట రహదారులు ప్రమాదకరంగా మారాయి. దశాబ్దాల తరబడి ఈ రోడ్లు మట్టిరోడ్లుగానే మిగిలిపోయాయి. దీంతో ప్రజలకు రహదారి కష్టాలు తప్పడం లేదు.



వంగర మండలంలో బాగేంపేట రోడ్డు బాగు చేయాలని డ్రోన్ కెమెరాలతో వినూత్న ప్రదర్శన(ఫైల్)

రేగిడిలో..

రేగిడి మండలంలోని పలు గ్రామాలకు లింకు రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడతో ప్రజలు ఇబ్బందులు పడతున్నారు. లింకు రోడ్లను తారు రోడ్లుగా మార్చేందుకు అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు చొరవ చూపకపోవడంతో ఆ గ్రామాల ప్రజలకు నేటికీ కష్టాలు తీరడం లేదు. మండలంలోని కొర్లవలస-పనసలవలస, కె.వెంకటాపురం-ఖండ్యాం , అక్కన్న అగ్రహారం -లక్ష్మీపురం, లచ్చారాయపురం-గుళ్లపాడు, గుళ్లపాడు-ఉంగరాడ, ఖండ్యాం-సోమరాజుపేట, అంబఖండి-గుళ్లసీతారాంపురం గ్రామాలకు రహదారులు చినుకుపడితే రోడ్లపై ప్రయాణాలు చేయలేని పరిస్థితి నెలకొంది.



రేగిడి మండలంలో అధ్వానంగా సోమరాజుపేటరోడ్డు

సంతకవిటిలో..



సంతకవిటి మండలంలో మందరాడ-గోవిందపురం గ్రామాలు మధ్య రోడ్డు

మండలంలో మొత్తం 34 పంచాయతీలు ఉండగా, మందరాడ-గోవిందపురం, మిర్తివలస-మండాకురిటి, మల్లయ్యపేట-శేషాద్రిపురం, మద్దూరుపేట-కృష్ణంవలస, కొండగూడేం, గరికిపాడు-సోమన్నపేట, పుల్లిట-ఎస్.రంగారాయపురం గ్రామాల మధ్య రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో అటు ప్రజలు, ఇటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారుల దుస్థితిపై రాజాం ఆర్ అండ్‌బీ ఏఈ నాగభూషణ మాట్లాడుతూ పలు పంచాయతీల రోడ్లు ఆర్‌అండ్‌బీతో పాటు పీఆర్‌ఐ పరిధిలోకి వస్తున్నాయని చెప్పారు. ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వచ్చే రోడ్ల స్థానంలో కొత్త రోడ్ల నిర్మాణానికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు.

యువత సత్ప్రవర్తనతో మెలగాలి



యువకులకు దిశా నిర్దేశం చేస్తున్న సీఐ

రామభద్రపురం: యువత సత్ప్రవర్తనతో మెలుగుతూ జీవనోపాధి కలిగే ఏ రంగంలోనైనా లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేయాలని సీఐ కె.నారాయణరావు అన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీరాంనగర్ కాలనీ సమీపంలో గల క్రికెట్ క్రీడా మైదానంలో ఆయన యువతకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సెల్‌ఫోన్ వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపైన బుధవారం అవగాహన కల్పించారు. యువత భవిష్యత్‌పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసవ్వకుండా భవిష్యత్ గురించి ఆలోచించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురికావద్దని హితవు పలికారు. లైసెన్స్‌తో పాటు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించి వాహనం నడపాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల అత్యుత్సాహం



బొద్దాంలో టీడీపీ కార్యకర్తలతో కొత పింఛన్లు పంపిణీ చేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగి

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామ సచివాలయ ఉద్యోగులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగుల తీరుపై గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. జనవరి నెలకు సంబంధించి కొత్తగా మంజూరైన పింఛన్లను పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు తెలియకుండా, ప్రోటోకాల్ ఉల్లంఘించి టీడీపీ కార్యకర్తలతో పంపిణీ చేసినట్లు గ్రామస్తులు బుధవారం అధికారులకు ఫిర్యాదు చేసారు. గ్రామ సచివాలయానికి చెందిన ఓ ఉద్యోగి కొత్త పింఛన్లు ప్రజాప్రతినిధులకు తెలియకుండా పంపిణీ చేయడంపై మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరి నూర్పులు మళ్లీ ప్రారంభం



మండలంలోని అన్ని గ్రామాల్లో తుఫాన్ అనంతరం వరి పంట నూర్పిళ్లు పునఃప్రారంభమయ్యాయి. బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడిన తుఫాన్‌ల వల్ల పంటను పొలాల్లోనే ఉంచి కొద్ది రోజులుగా కాపాడుతూ వచ్చారు. గడిచిన నాలుగైదు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని ఎండలు కాస్తుండడంతో రైతులు పంటలను ఆరబెట్టి నూర్పిళ్లు చేస్తున్నారు. బుధవారం మండలంలోని అంబకండి, వన్నలి, చాటాయివలస, వండానపేట, సోమరాజుపేట తదితర గ్రామాల్లో ముమ్మరంగా వరి నూర్పులు పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. – రేగిడి

సరదగా.. సందడిగా...

నూతన సంవత్సర వేడుకలు సరదగా.. సందడిగా జరిగాయి. ప్రతి చోట ప్రజాప్రతినిధులకు ఆయా పార్టీల శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సందడి చేశారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంచిపెట్టి సరదగా గడిపారు. పల్లెలు, పట్టణాలన్న తేడా లేకుండా బాణసంచా కాల్చుతూ మంగళవారం అర్ధరాత్రి కొత్త సంవత్సరానికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారుల కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, సోదరుడు వేణుగోపాలనాయుడులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మండలాధికారులు, కార్యదర్శులు



బొబ్బిలి రూరల్: ఎంపీపీ శంబంగి లక్ష్మీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, సిబ్బంది



రామభద్రపురం: పీహెచ్‌సీ ముందు ముగ్గులు వేస్తున్న వైద్యాధికారిణి, సిబ్బంది



బొబ్బిలి: కోటలో ఎమ్మెల్యే బేబీనాయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న శ్రేణులు



బొబ్బిలి : మున్సిపల్ చైర్మన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు, నాయకులు



తెర్లాం: ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏఈ సత్యంనాయుడు



రేగిడి: పవీపురంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మకు శుభాకాంక్షలు చెబుతున్న అభిమానులు



సంతకవిటి : హోంజరాంలో ఎంపీపీ సిరిపురపు మంజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు



రాజాం : వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు



బాడంగి: ఎంపీపీ భోగిగారి, జెడ్పీటీసీ రామారావుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీడీఓ, సిబ్బంది



వంగర : మద్దివలసలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



రామభద్రపురంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వెలుగు సిబ్బంది

నేడు నీటి సరఫరా నిలిపివేత

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని పలు ప్రాంతాలకు ఈ నెల 2న నీటి సరఫరా నిలుపుదల చేయనున్నామని కమిషనర్ జె.రామప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా పాలకొండ రోడ్డులోని పైపులైన్ల మరమ్మతులకు గురైన కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. డోలపేట హెడ్‌వాటర్ ట్యాంకు పరిధిలోని డోలపేట, పొనుగుటివలస, బుచ్చెంపేట, మారుతీనగర్, విద్యానగర్, వరలక్ష్మీనగర్ తదితర ప్రాంతాలకు ఈ అంతరాయం ఏర్పడనుందని అన్నారు. ఆయా ప్రాంతాల్లో వాటర్‌ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయనున్నామని తెలిపారు.

విద్యార్థికి అభినందన



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

వంగర: వంగర గ్రామానికి చెందిన పొట్టా చంద్రశేఖర్‌ను మంగళవారం గ్రామస్తులు అభినందించారు. చంద్రశేఖర్ ఇటీవల విడుదలైన సీఏ (చార్టెడ్ అకౌంటెంట్) ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామస్తులంతా జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు.

గురుకులం ప్రిన్సిపాల్‌గా కేబీబీ రావు

నెల్లిమర్ల: మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కేబీబీ రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఆయన ఎంజేపీఏపీ గురుకులాల సొసైటీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన శ్రీనివాస్ ఇకపై అధ్యాపకునిగా కొనసాగనున్నారు.